OPENING SOON
శ్రీ వారాహి సిల్క్స్
పట్టు । హైఫ్యాన్సీ । మీడియం ఫ్యాన్సీ । లోఫ్యాన్సీ
సెల్: 96668 89459
శ్రీ వారాహి సిల్క్స్, కృష్ణాపార్క్ దగ్గర, శ్రీకాకుళం
స్టాఫ్ కావలెను
సేల్స్‌మెన్స్ (జంట్స్), హెల్పర్స్ (బాయ్స్ & గర్ల్స్)
కనీసం రెండు సంవత్సరాలు అనుభవం కలిగినవారు కావలెను
- వారాహి సిల్క్స్ మేనేజ్‌మెంట్

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 29-11-2024
సంపుటి: 20 సంచిక: 209
పేజీలు: 4 వెల: రూ.1





## మౌనమే ఆయన భాష..
# ఇన్‌ఛార్జి కోసం పార్టీ ఘోష

- శ్రీకాకుళం వైకాపాకు కొత్త నాయకత్వం
- రేసులో వెలమలు, కాపులు
- అర్బన్‌పైనే జగన్ చూపు
- రెండేళ్ల కోసం తాత్కాలిక నియామకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఇంకా మౌనం వీడకపోవడంతో శ్రీకాకుళం నియోజకవర్గానికి వైకాపా తరఫున నూతన ఇన్‌ఛార్జిని నియమించే పనికి ఉపక్రమించింది ఆ పార్టీ. కొద్ది రోజుల క్రితం ఉత్తరాంధ్ర వైకాపా ఇన్‌ఛార్జి విజయసాయిరెడ్డి ధర్మాన ప్రసాదరావు ఇంటికి వచ్చి చర్చలు జరిపినా, రెండేళ్ల పాటు తాను ఎటువంటి యాక్టివిటీలోనూ ఉండలేనని స్పష్టం చేయడంతో ఇప్పుడు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి కొత్త ఇన్‌ఛార్జి కావాల్సి వచ్చింది. ఆమదాలవలస మాదిరిగానే కొత్త ఇన్‌ఛార్జిని సూచించే బాధ్యతను కూడా ధర్మాన ప్రసాదరావుకే పార్టీ అప్పగించింది. ఆమదాలవలసలో తమ్మినేని సీతారామ్‌కు పార్లమెంట్‌కు వెళ్లమని, అసెంబ్లీ స్థానానికి అభ్యర్థిని సూచించమని చెప్పిన వైకాపా అధిష్టానం ఆయన కుటుంబ సభ్యుల పేర్లు తప్ప వేరేవారి పేర్లు చెప్పకపోవడంతో చింతాడ రవికుమార్‌ను ఇన్‌ఛార్జిగా నియమించింది. ఇప్పుడు ధర్మాన ప్రసాదరావుకు కూడా అదే ఛాయిస్ ఇచ్చినట్లు భోగట్టా. రెండు రోజుల క్రితం పార్టీ తరఫున సజ్జల రామకృష్ణారెడ్డి ధర్మానకు ఫోన్ చేసి శ్రీకాకుళం నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిను ఏర్పాటు చేస్తున్నామని, అందుకు కొందరి పేర్లు సూచించాలని కోరినట్లు తెలిసింది. అయితే ధర్మాన ఏ పేర్లు పంపించారన్నదానిపై ఇప్పటి వరకు ఎక్కడా ఊహాగానాలు కూడా జరగడంలేదు. కానీ ఆయన ఐదు పేర్లు పంపారని, అందులో నచ్చినవారిని పార్టీ ఎంపిక చేసుకుంటుందని మాత్రం కొందరు చెప్పుకుంటున్నారు. రెండేళ్ల తర్వాత ధర్మాన ప్రసాదరావు మళ్లీ రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తే కొత్త ఇన్‌ఛార్జిను తప్పించి మళ్లీ ఆయనకే పగ్గాలిస్తారని పార్టీ ప్రచారం సాగుతుంది. అయితే అటువైపు ఉన్నది జగన్మోహన్ రెడ్డి కావడంతో ఆ సమయానికి ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఇంతకీ ధర్మాన ప్రసాదరావు శ్రీకాకుళం నియోజకవర్గం నుంచే 2029 ఎన్నికల్లో పోటీ చేస్తారా? లేదూ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మరో కొత్త నియోజకవర్గం ఏర్పడుతుంది కాబట్టి అక్కడికి వెళ్తారా? అన్న మీమాంస అందరిలోనూ ఉంది. 2026లో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. అదే జరిగితే టెక్కలి నియోజకవర్గంలో ఉన్న కోటబొమ్మాళి ప్రాంతం నుంచి కొంత, నరసన్నపేట నియోజకవర్గంలో సారవకోట నియోజకవర్గంలో ఉన్న ప్రాంతంలో కలిపి 1.80 లక్షల జనాభాకు కొత్త నియోజకవర్గం ఏర్పడుతుంది. ఇది పూర్తిగా వెలమల ప్రాబల్యం ఉన్న సెగ్మెంటే కానుండటంతో ధర్మాన అక్కడికి వెళ్తారన్న ప్రచారం కూడా సాగుతుంది. అయితే పునర్విభజన అనేది ఇచ్ఛాపురం నుంచి మొదలుపెడతారా? అనంతపురం నుంచి నరుక్కొస్తారా? అనేది ఇంకా తేలకపోవడం వల్ల ధర్మాన కూడా తన మనసులో మాటను ఎక్కడా బయట పెట్టడంలేదని తెలుస్తుంది. రెండేళ్ల వరకు రాజకీయ విరామం అవసరమని ఎన్నికల తర్వాత నుంచి చెప్పుకొస్తున్న ధర్మాన ఇప్పటికీ అదే మాట మీద ఉన్నారు. ఆర్గనైజేషన్ స్కిల్స్ ఉన్న ధర్మానను కాదని శ్రీకాకుళంలో వైకాపా ఎన్నికలకు వెళ్లడం సరికాదనే భావన కూడా ఆ పార్టీకి ఉంది. అందుకే పార్టీని శ్రీకాకుళంలో నడపడం కోసం ఒక కొత్త ఇన్‌ఛార్జిని సూచించమని ఆయనకే బాధ్యతలు అప్పగించారు.

ధర్మాన కాదంటే పార్టీ పరిశీలించే పేర్లు కొన్ని ఉన్నాయి. లేదూ ధర్మానే బొట్టు పెట్టాలి అంటే మరి కొందరు ఉన్నారు. ఇందులో ఎవర్ని నియమిస్తారనేదే మిలియన్ డాలర్ల ప్రశ్న. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు స్థానిక నేతల కోటాలో ఎమ్మెల్సీ పదవి చివరి వరకు వచ్చి తప్పిపోయిన ఎంవీ పద్మావతి వైపు ఆ పార్టీ అధినేత జగన్ చూస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల శ్రీకాకుళం కూడా రెండు నియోజకవర్గాలుగా మారుతుంది. ఇందులో అర్బన్, దానికి ఆనుకొని ఉన్న కొన్ని పంచాయతీలు కలిపి ఒక నియోజకవర్గం కానుంది. కాబట్టి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పని చేసిన పద్మావతికి ఈ బాధ్యతలు అప్పగించాలన్న యోచన పార్టీకి ఉంది. కాకపోతే దీనికి ధర్మాన ఆమోదముద్ర వేస్తారా? లేదా? అనేది మాత్రం తెలియదు. కాపు నేతలకే ఇన్‌ఛార్జిగా నియమించాలని పార్టీ భావిస్తే బహుశా ధర్మాన ప్రసాదరావు మామిడి శ్రీకాంత్ పేరును సూచించే అవకాశం కూడా లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. గార, శ్రీకాకుళం మండలాల్లో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలోనే వైకాపాకు ఉన్నారు. అక్కడి నుంచి పార్టీ కార్యక్రమాలు నడపడానికి నాయకులకు కొదవ లేదు. కానీ శ్రీకాకుళం నగరానికే ఎన్నికలయి పద్నాలుగేళ్లు గడిచిపోవడంతో ఇక్కడ కేడర్ జవసత్వాలు కోల్పోయింది. గడిచిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గొండు శంకర్‌కు అర్బన్ ఏరియా నుంచే పెద్ద మెజార్టీ రావడం ఇందుకు నిదర్శనం. అందుకే లోకల్‌గా ఉండే పద్మావతి వైపు పార్టీ చూస్తుందని భోగట్టా. మరోవైపు శ్రీకాకుళం ఎంపీపీ ప్రతినిధి అంబటి శ్రీను పేరు కూడా పరిశీలనలో ఉంది. ఈయనకు ఇన్‌ఛార్జి పదవి ఇస్తే ధర్మాన ఎప్పుడు యాక్టివేట్ అయితే, అప్పుడు కుర్చీ ఖాళీ చేయడానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవు కాబట్టి ఆయన పేరు అధిష్టానానికి వెళ్లుంటుందని తెలుస్తుంది. అంబటి శ్రీను ధర్మాన విధేయుడిగా మొదట్నుంచీ పని చేస్తున్నారు. ఇప్పుడు ఆయనకు పార్టీ ఇన్‌ఛార్జి పగ్గాలు అవసరం లేకపోయినా ధర్మాన కోసం తీసుకోమంటే కాదనే పరిస్థితి ఉండదు. ఇక మాజీ జిల్లాపరిషత్ చైర్మన్ వైవీ సూర్యనారాయణ తనయుడు వైవీ శ్రీధర్ పేరు కూడా బలంగానే వినిపిస్తుంది. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన శ్రీధర్‌కు అత్తవారి వైపు కూడా పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉండటం కలిసొచ్చిన అంశం. ప్రస్తుతం ఆయన భార్య శ్రీకాకుళం జెడ్పీటీసీగా వ్యవహరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ గొండు నర్సింగరావు తనయుడు వాసు ఇటీవలే హైదరాబాద్ నుంచి వచ్చి శ్రీకాకుళంలో సెటిలయ్యారు. ఈయన కూడా రాజకీయ అభిలాషతోనే ఉద్యోగం మానుకొని వచ్చారని, ఈయన పేరు కూడా పరిశీలించొచ్చని చెబుతున్నా ప్రస్తుతం వైకాపాలో జరుగుతున్న పరిణామాలను బట్టి పాత చరిత్ర లేకుండా కొత్తవారికి పగ్గాలు అప్పజెప్పే పరిస్థితి కనిపించడం లేదు. మామిడి శ్రీకాంత్‌కు ఎప్పుడు ఏ పదవి వరించినా ఆయన నాన్‌లోకల్ అనే నినాదం తెర మీదకు వస్తోంది. పద్మావతికి రావాల్సిన ఎమ్మెల్సీ పోస్టు ఇచ్ఛాపురానికి చెందిన నర్తు రామారావుకు వెళ్లిపోయిందన్న భావన కాపుల్లో

- మిగతా 4లో

- సరిగ్గా పాలించకే 11 సీట్లు
- ఇప్పుడు అసెంబ్లీకి వెళ్లకుండా ఫీట్లు
- ఐదేళ్లూ కనబడని ప్రెస్
- ఇప్పుడు అదే వేదికగా స్టేట్‌మెంట్లు

## అధికారంలోనూ, ప్రతిపక్షంలోనూ
# వైకాపా ఫెయిల్





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సినిమా ఆర్టిస్టులు, క్రికెటర్లు లోక్‌సభకో, రాజ్యసభకో ఎన్నికై, మొత్తం పని రోజుల్లో పదో వంతు కూడా వెళ్లలేదని తెలిసినప్పుడు 'వీళ్లకు ఈ పదవులు అవసరమా? రాజకీయాలు అవసరమా?' అని ఘాటైన విమర్శలు వినబడుతూంటాయి. అలాటిది ఫక్తు రాజకీయ నాయకులు. ప్రజల్లో తిరిగేవారు, రేప్పొద్దున ఓట్ల కోసం దేబిరించవలసినవారు అస్సలు అసెంబ్లీకి వెళ్లం అంటే జనం ఒప్పుకుంటారా? 39 శాతం మంది ఓటర్లు మీరేదో ఉద్ధరిస్తారనుకుని ఓట్లేశారే! అధికారం ఉన్నా లేకపోయినా, వాళ్ల కోసం అసెంబ్లీలో గళం విప్పుతారని ఆశపడ్డారే. వాళ్ల సంగతేమిటి? అబ్బే, అసెంబ్లీలో కాకపోయినా, ఊళ్లో రచ్చబండ దగ్గర గావుకేకలు పెడతాంలే అంటే, 'అయితే అక్కడే ఉండాల్సింది. అసెంబ్లీకి వెళ్లేవాడికే ఓటు వేద్దుం' అనరూ?

జాతీయ స్థాయిలో బీజేపీ (పూర్వరూపం జనసంఘ్) 1984లో 2 సీట్లే తెచ్చుకుంది. అయినా 1980 నుంచి అది ప్రతిపక్షంలోనే ఉంది. కానీ వైకాపా ఐదేళ్ల పాలన తర్వాత గతంలో ఉన్న సీట్లలో 7 శాతం తెచ్చుకుంది. ఇప్పుడు అసెంబ్లీ బహిష్కరిస్తామని చెప్పి ప్రతిపక్షంగా కూడా తాము విఫలమయ్యాయని వైకాపా చాటుకుంటోంది. సాధారణంగా అధికారపక్షం అసెంబ్లీ లేదా పార్లమెంటు సమావేశాలను ఎగ్గొడదామని, కనీసం కుదిద్దామని, నడిచే రోజుల్లో కూడా ఏదో ఒకటి గలాభా చేసి, సభను వాయిదా వేయిద్దామని చూస్తుంది, ప్రతిపక్షం తమను ఎండగడుతుందనే భయంతో. కానీ ఇక్కడ ఏకంగా అసెంబ్లీకే రామని అధికార పక్షానికి ఊపిరి పోస్తుంది జగన్ పార్టీ. బయట మీడియాతో మాట్లాడి, మా ముచ్చట తీర్చుకుని తృప్తిపడతాం అంటోంది. అసెంబ్లీకి వెళ్లనపుడు ఎన్నికలలో పోరాడడం దేనికి? చచ్చీచెడి గెలవడం దేనికి? కమ్యూనిస్టుల్లా బయట ఉద్యమాలు చేసుకుంటూ గడిపేయవచ్చుగా!

ఎన్నికలకు ముందు 'సిద్ధం' అంటూ వైకాపా చాలా హడావిడి చేసింది. అంటే మూడు పక్షాల కూటమితో పోరాడడానికి సిద్ధంగా ఉన్నారని జనాలు అనుకున్నారు. అధికారం అనుభవించడానికి సిద్ధం, అసెంబ్లీలో నోరు విప్పడానికి మాత్రం సిద్ధం కాదు అనే అభిప్రాయం మనసులో ఉంటే ఆ ముక్క పైకి చెప్పాల్సింది.

ప్రజలు ఏయే విషయాల్లో ఆగ్రహిస్తున్నారో గమనించి, దానికి తగ్గట్టుగా ఉద్యమాలు, నిదర్శన ప్రదర్శనలు చేయడం ప్రతిపక్షం బాధ్యత. అది గుర్తించే సీపీఐ రామకృష్ణ వంటివారు కూడా బాబుతో ఉన్న సాన్నిహిత్యాన్ని పక్కనపెట్టి, ఘాటైన విమర్శలు చేస్తున్నారు. బయట ప్రదర్శనలు చేయడానికి అంగబలం, అర్థబలం వెచ్చించాలి. అసెంబ్లీలో అయితే ఆ ఖర్చు ఏమీ లేదు. లేచి నిలబడి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రశ్న ఒకటి అడిగితే చాలు. 'మీ హయాంలో కంటె ఎక్కువేలే' అనో, 'వాటి గురించి కమిటీ వేశాం' అనో ఏదో ఒకటి చెప్తుంది. అది వినగానే ప్రజలకు అర్థమౌతుంది. బయట చేస్తే కేసులు ఎదుర్కోవలసి వస్తుంది. అయినా ఏదైనా డిబేట్ ఉన్నపుడే, ఖండనమండనలు ఉన్నపుడే రసవత్తరంగా ఉంటుంది. నోరు జారి నిజం చెప్పడమో, జవాబు చెప్పలేక నీళ్లు నమలడమో, దాట వేయడానికి ప్రయత్నించడమో, చర్చ ముగిసిందని స్పీకరు చేత ప్రకటింప చేయడమో.. ఓదో ఒకటి జరిగితే సమాధానం రాబట్టినట్లే. డిబేట్ లేకుండా ఎవరి పాటికి వాళ్లు స్టేటుమెంట్లు ఇస్తూపోతే మరి ప్రతిపక్షం ఎందుకు? రాజ్యాంగ నిర్మాతలు కల్పించిన ఈ అవకాశాన్ని కాలరాసి, బయటకు వచ్చి మాట్లాడతామంటూ ఊరడింపులు దేనికి? అసెంబ్లీకి వెళ్లకపోవడంతో తమ హక్కు మాత్రమే వదులుకుంటున్నామని ప్రజా ప్రతినిధులు అనుకుంటే అది పొరపాటు. తమ హక్కుతో పాటు ప్రజల హక్కును కాలరాస్తున్నారు వీరు. నిండుసభలో ప్రశ్నలు లేవనెత్తే ధైర్యం ఉందనుకుని ఓట్లేసి పంపించారు. అలాటప్పుడు 'వెళ్తే నాకు వాళ్లు మైకివ్వరు, మాట్లాడనివ్వకపోగా నన్ను గేలి చేస్తారు' అని సాకులు చెప్పి వెళ్లడం ఎగ్గొడితే ఎలా? 'పరీక్షకు వెళ్లినా మాస్టారు మార్కులేయడు, అందుకని పరీక్షకే వెళ్లన'ని ఎవరైనా అంటే ఊరుకుంటారా? వెళ్లాలి, నాలుగు అనాలి, నలభై పడాలి. దానికి ఒప్పుకునే బరిలో నిలబడ్డారు. తీరా గెలిపించినదాకా ఉండి, ఇప్పుడీ వేషాలేస్తే ఎలా? 2014-19 మధ్య అసెంబ్లీలో జగన్‌ను ఏమైనా ఊరేగించారా? జగన్ లేచి నిలబడగానే 'లక్ష కోట్లు' 'లక్ష కోట్లు' అనే అరుపులు, రోజా నిలబడగానే 'జబర్దస్త్ ఆంటీ' అంటూ కూతలు. అయినా నాలుగేళ్లు వెళ్లారుగా. మరి ఇప్పుడే మొచ్చింది? పూలదండలతో పాటు, రాళ్లూ పడతాయని తెలిసే ఈ వృత్తిలో దిగాలి. రచయితకైనా, నటుడికైనా, పబ్లిక్‌లోకి వచ్చి నిలబడిన ఎవడికైనా ఇది తప్పదు. దాన్ని డీల్ చేయడం తెలియకపోతే విత్‌డ్రా అయిపోవాలంతే.

తను ముఖ్యమంత్రిగా ఉండగా జగన్ చంద్రబాబును తన పార్టీ సభ్యులు ఈసడిస్తూ ఉంటే చిరునవ్వులు చిందిస్తూ కూర్చునేవాడు. 'కురుసభలో దుర్యోధనుడిలా నవ్వుతున్నాడు' అనే విమర్శలు వచ్చినా మానుకోలేదు. చాలాకాలం చంద్రబాబు సహించారుగా! చివరి సగకాలం అసెంబ్లీని బహిష్కరిద్దామని అనుకున్నపుడు భువనేశ్వరి పేర డ్రామా చేసినా, కనీసం రెండున్నరేళ్లు అసెంబ్లీకి వెళ్లారుగా! ఇంతకీ అసెంబ్లీ గైర్హాజరీకి జగన్ చెప్పే కారణం ఏమిటి? తను మాట్లాడదామనుకుంటే మైకు ఇవ్వరట, అస్సలు ఇవ్వరని కాదు, ముఖ్యమంత్రితో సమానంగా ఇవ్వరట! 164 సీట్ల కూటమికి నాయకుడిగా ఉన్న వ్యక్తితో సమానంగా ఛాన్స్ రావాలని ఉంటే కనీసం 18 సీట్లయినా తెచ్చుకునేట్లా పాలించి ఉండాల్సింది. బొత్తిగా 11 దగ్గర ఆగిపోయి, ఈ ఆరున్నొక్క రాగాలెందుకు? '10 శాతం సీట్లు ఉంటేనే తప్ప ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వనక్కరలేదని రాజ్యాంగంలో లేదు, సంప్రదాయం మాత్రమే. ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వలేదు కాబట్టి.. అని దీర్ఘాలు తీస్తున్న జగన్ పాత టీడీపీ హయాంలో ఆ హోదా అనుభవించినప్పుడూ ఫిర్యాదు చేసి, చివరి ఏడాది అసెంబ్లీకి వెళ్లడం మానుకున్నారుగా! మైకు ఇవ్వటం లేదని అప్పుడూ ఫిర్యాదు చేశారుగా! ఇప్పుడు హోదా ఇచ్చి కూడా మైకు కట్ చేయవచ్చేమో! చేయకపోవచ్చేమో! సీను ముందే ఊహించుకుని వెళ్లకపోవడమేమిటి, అర్థరహితంగా! అధికార పక్షం అప్రజాస్వామికంగా నడుస్తోందనే రుజువేదీ చూపకుండా ఆరోపణలు చేస్తే జనం ఎలా నమ్ముతారు? జగన్ అసెంబ్లీకి వెళ్లను అనగానే గతంలో ఎన్టీయార్, జయలలిత వెళ్లలేదు అంటూ కథనాలు వినిపిస్తున్నారు. వాళ్లు చెప్పనిదేమిటంటే, ఎన్టీఆర్ వెళ్లకపోయినా, చంద్రబాబు వెళ్లేవారు, కాంగ్రెసు దుంప తెంపేవారు. జయలలిత వెళ్లకపోయినా ఆమె పార్టీ సభ్యులు వెళ్లి దుమ్ము దులిపేవారు. ఇప్పుడు జగన్ 'నేనే కాదు, మా వాళ్లనీ పంపను' అంటున్నారు. దానికి లాజిక్ ఏమైనా ఉందా? వాళ్లు అధికార పార్టీలో ఉన్నపుడు కూడా అసెంబ్లీలో నోరు విప్పారో లేదో! ఏమైనా మాట్లాడారో లేదో! ఇటీవలి సంప్రదాయం ఏమిటి? అసెంబ్లీలో వాగ్వాదాలు, పేపర్లు చింపి స్పీకరుమీద పోయడాలు, మైకులు విరగ్గొట్టడాలు, మార్షల్స్

- మిగతా 4లో



● ఎడిటోరియల్

# కనుపాపను కాటేస్తున్నాయ్..!

బయటి నుంచి సమస్యలు ఎదురైతే బలం కోసం కుటుంబం వైపు చూస్తాం.. అటువంటిది ఆ కుటుంబమే సమస్యయితే ఎవరికి చెప్పుకోవాలంటాడు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఓ సినిమాలో. ఇప్పుడు అటువంటి సమస్యే కుటుంబాల నుంచి స్త్రీలకు ఎదురవుతోందని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక స్పష్టం చేసింది. ఇటీవలె ఐరాస కొన్ని లెక్కలు విడుదల చేసింది. గతేడాది సగటున రోజుకు నూటనలభై మంది మహిళలు, బాలికలు వారి భాగస్వాములో, బంధువుల చేతుల్లోనో మరణించారని ఆ నివేదికలు తేల్చిచెప్పాయి. సరిగ్గా ఇరవై ఏళ్ల కిందట కూడా ఐరాస మహిళలపై జరుగుతున్న హింస గురించి ఇలాగే ఆందోళన వ్యక్తం చేసింది. ఏళ్లు గడుస్తున్నా పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేదు సరికదా హింస మరింత పెరిగింది. అంటే ఈ భూమిపై మహిళ మనుగడ ఎంతటి ప్రమాదంలో ఉందో దీన్ని బట్టి అర్థమవుతోంది. అందునా ఇల్లే ఆమెకు అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంగా మారిపోయింది. 'జీవితమే పెనుమంటలు చెలరేగే ఓ మేలిముసుగు' అని స్వాతంత్ర్య సమర యోధురాలు సరోజినీనాయుడు అన్నట్టు ఆ మేలిముసుగుల కింద దగ్ధమవుతున్న మహిళలు ఎందరో! ఐరాస నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి మహిళా, ప్రతిచోటా తన జీవిత కాలంలో ఏదో ఒక దశలో లైంగికదాడులకో, వేధింపులకో, శారీరక, మానసిక హింసకో గురవుతోంది. ఇక బాలికల్లో ప్రతి నలుగురిలో ఒకరు హింసకు బాధితులుగా నిలుస్తున్నారు. అందుకే 'ఏ స్త్రీలు తమను తామే కాపాడుకుంటారో వారే సురక్షితంగా ఉన్నట్టు' అని వందేళ్ల కిందటే బండారు అచ్చమాంబ అన్నారు. యుఎన్ వుమెన్, యుఎన్ ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ అండ్ క్రైమ్ అనే రెండు సంస్థల తాజా నివేదికల ప్రకారం 2023లో ప్రపంచ వ్యాప్తంగా 51,100 మంది మహిళలు కుటుంబ సభ్యుల చేతిలో ప్రాణాలు కోల్పోయారు. అంటే ప్రతి పది నిమిషాలకు ఓ మహిళ తాను నమ్మిన, తనకు కావాల్సిన, తనను కాపాడాల్సిన వారి చేతుల్లోనే బలైపోయింది. అందుకే 'క్షమించొద్దు.. మహిళల పట్ల హింసను నిర్మూలించేందుకు చేతులు కలుపుదాం' అంటూ ఐరాస పిలుపునిచ్చింది. స్త్రీల పట్ల దాష్టికాలు ప్రధానంగా సామాజిక, కుటుంబ, రాజ్యహింస రూపంలో జరుగుతున్నాయి. ఇవి తరతరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. అలాగే పేదరికం, మద్యపానం, మూఢనమ్మకాలు.. ఇవన్నీ కలిసి తల్లిదండ్రుల చేతుల్లోనో, భాగస్వామి చేతుల్లోనో మహిళలు హింసకు గురవుతూనే ఉన్నారు. ఇవిగాక సైబర్ బెదిరింపులు, అక్రమ రవాణా, లైంగిక దోపిడీ వంటి సామాజిక హింసనూ మౌనంగా భరిస్తున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం దాదాపు 30 శాతం మహిళలు కుటుంబ హింస బాధితులే. గర్భిణులుగా ఉన్నప్పుడు కూడా హింసను భరించారని ఆ సర్వేలు చెబుతున్నాయి. ఈ హింసకు పురుషాధిక్య భావజాలం ఓ కారణమైతే.. స్త్రీ కూడా సాటి మనిషే అనే అవగాహన కల్పించడంలో, మహిళల ప్రాథమిక హక్కులను రక్షించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవ్వడం ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు. సమానత్వం గురించి మాట్లాడకపోగా 'స్త్రీ పుట్టిందే మగవాడికి సేవ చేసేందుకు. భర్త తిట్టినా కొట్టినా మౌనంగా భరించాల్సిందే. పొరపాటున ఎదిరించి మాట్లాడితే ఆ ఆడది అసలు పతివ్రతే కాదు' అని చెప్పే మనుధర్మ శాస్త్రాన్ని పరమ పవిత్రంగా పూజిస్తున్నారు. భుజాలకెత్తుకొని మరీ ప్రచారం చేస్తున్నారు. కట్టుబాట్లు, సంప్రదాయాల పేరిట మహిళలను ఇంకా పురుషాధిక్య సంకెళ్లకే పరిమితం చేస్తున్నారు. మన పాలకుల విధానాలు ఇలా ఉన్నాయి కాబట్టే వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) రూపొందించిన గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ - 2021 ప్రకారం మొత్తం 156 దేశాల్లో జెండర్ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఇండియా 140వ స్థానంలో ఉంది. ఇక మూఢవిశ్వాసాలు రాజ్యమేలుతున్న మనదేశంలో అమ్మాయిల పుట్టుకే ప్రశ్నార్థకంగా మారిపోయింది. లింగనిష్పత్తిలో తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. మహిళా అభివృద్ధి, సమానత్వం, సాధికారత అంటూ పాలకులు చెప్పుకుంటున్న నినాదాల్లోని డొల్లతనాన్ని ఇవి స్పష్టం చేస్తున్నాయి. మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులు సైతం ఆచరణలో అమలు కాకపోవడం శోచనీయం. వాటిని అమలు చేసుకునేందుకు కూడా పోరాడాల్సిన స్థితి దాపురించడం బాధాకరం. ఏదిఏమైనా హింసను నివారించడం, బాధితులకు రక్షణ కల్పించి, జీవితంలో నిలదొక్కుకునేందుకు సాయపడటం, దోషులను శిక్షించడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యంగా ఉండాలి. చట్టాలు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి. స్త్రీ-పురుష సమానత్వ ప్రాముఖ్యం గురించి పాఠ్యాంశాల్లో చేర్చాలి. మహిళలను గౌరవించాలి అనే సంస్కృతిని విద్యార్థి దశ నుండే అబ్బాయిలకు నేర్పించాలి. అందుకు తగ్గట్టు ప్రభుత్వాలు సమగ్రమైన విధానాలను రూపొందించాలి.

## పాఠశాలల్లో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత నానాటికీ ప్రశ్నార్థకంగా మారుతోందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ఆవేదన వ్యక్తం చేశారు. రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. తొలుత ప్రార్థనా సమావేశంలో విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో క్రమశిక్షణతో మెలగాలని, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని కోరుతూ వారి ఉజ్వల భవిష్యత్‌ను ఆకాంక్షించారు.

### విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలి

ఇటీవల పాఠశాలల పనివేళలు పెంచడం వలన దూర ప్రాంతాల నుండి రాకపోకలు సాగించే విద్యార్థులకు ముఖ్యంగా ఆడపిల్లల భద్రతరీత్యా యిబ్బందులు ఎదురవుతున్నాయని, వారిని ఇళ్లకు చేర్చే విధంగా రవాణా సౌకర్యం కల్పించాలని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రామకృష్ణారావు, ఏపీటీఎఫ్ (257) జిల్లా ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు, ఎస్.రామన్న, డి.అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## యూనియన్లకతీతంగా ఈ ఎన్నిక నిర్వహించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రెస్‌క్లబ్ ఎన్నికలు యూనియన్లకు అతీతంగా నిర్వహించాలని శ్రీకాకుళం యువ జర్నలిస్టులు కోరారు. ఈమేరకు డే&నైట్ జంక్షన్ వద్ద సమావేశాన్ని నిర్వహించారు. నగరంలో జర్నలిస్టుల కోసం ఒక వేదికగా ఉండడానికి, సమావేశాలు జరపడానికి, ప్రెస్‌క్లబ్ అనేది ఎంతో అవసరమన్నారు. చాలాకాలంగా ప్రెస్‌క్లబ్ కార్యవర్గం లేక జర్నలిస్టులకు పెద్దదిక్కు ఎవరు ఉండకపోవడంతో జర్నలిస్టుల సంక్షేమం మరుగున పడుతుందన్నారు. ఈ తరుణంలో ప్రెస్‌క్లబ్ ఎన్నికలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు డోల శంకరరావు, డాక్టర్ చింతాడ అప్పలనాయుడు, కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు డా. డోల అపన్న, డా.తిత్తి ప్రవీణ్‌కుమార్, అద్దంకి సురేష్, చల్లా గణపతి, గుండబాల మోహన్, బొడ్డ కృష్ణ, జనార్ధన, బొడ్డేపల్లి రాజేష్, మొదలవలస వాసు, బలగ మోహన్, లీలాకృష్ణ, మోహన్, అనంత్, రవిలు పాల్గొన్నారు.



## సర్వజన ఆస్పత్రిని అభివృద్ధి పథంలో నడిపిస్తా..!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, రోగులకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని బలగలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రిమ్స్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే శంకర్ శుక్రవారం నిర్వహించారు. రోగులకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరుస్తామన్నారు. సిటీస్కాన్, ఎక్షల నిమిషంలో తరచూ మొరాయిస్తున్నాయని ఎమ్మెల్యేకు సిబ్బంది తెలపడంతో వాటిని పరిశీలించి తనకు వివరాలు అందిస్తే కొత్త పరికరాల ఏర్పాటుకు చర్యలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ ఆస్పత్రి అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్ట్ కార్డు ఉద్యమం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రుల ఆత్మ బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నేటి కేంద్రప్రభుత్వం కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టేందుకు కుట్ర చేసిందని, అందుకు స్టీల్ ప్లాంట్ పరిరక్షించుకునేందుకు ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు ఉత్తరాంధ్రలో రాజకీయాలకతీతంగా ప్రతి పౌరుడు పోరాట ఉద్యమంలో పాల్గొవాలని జేటిఆర్ యువసేన అధ్యక్షులు ఆర్.నాగేశ్వరరావు (నాగ) పిలుపునిచ్చారు. ఇటీవల పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలంలో అక్కుపల్లి, గడురు, పల్లి సారధి, అమలపాడు తదితర ఉద్దానం గ్రామాలలో విస్తృతంగా ఆయన పర్యటిస్తూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్ట్‌కార్డు ఉద్యమ కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగ మాట్లాడుతూ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర సర్కారు వెనక్కు తీసుకోవాలని నాగ హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు పదివేల కోట్ల రూపాయలు సాయాన్ని కేంద్రం అందించి, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, భూములు ఇచ్చిన నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ మిగులు భూములను నిర్వాసితులకు ప్రాధాన్యతనిచ్చి, ఉత్తరాంధ్రలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న డిమాండ్లతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పదిలక్షల పోస్ట్ కార్డులను పంపే యజ్ఞం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నేతలు పోతనపల్లి అరుణ, కొర్రయి సూర్యనారాయణ, సుధాకర్, మూస వరప్రసాద్, రమేష్, అంతం, జీవిత ప్రజా సంఘ నేతలు పాల్గొన్నారు.

## నైపుణ్యతతోనే ఉన్నత అవకాశాలు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

వృత్తి విద్యా శిక్షణలో చదువుతోపాటు నైపుణ్యం ఎంతో అవసరమని తద్వారా ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలో దన్నాన్నపేటలో ఉన్న స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడారు. కంపెనీలకు అనువైన శిక్షణను అందించనున్నట్లు తద్వారా పరిశ్రమలతోపాటు యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. మునుముందు పదులసంఖ్యలో పరిశ్రమలు జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. జాబ్‌మేళాకు హాజరైన యువతను వారి విద్యార్హతలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగం చేయడానికి పరిశ్రమలు ఎక్కడ ఉన్న యువత ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కంపెనీల హెచ్.ఆర్లు, పాలిటెక్నికల్ అధ్యాపకులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు. స్క్రిన్ టెస్టుల ద్వారా ఉద్యోగ ఎంపిక ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.




**లైఫ్ అంటే ఒక ఇమేజ్ చట్రంలో చిక్కుకోవడం కాదు.. తమ చుట్టూ ఉన్న కొన్ని లేయర్స్ పరిధిలోనే ఉండటం కాదు.. బౌండరీలు దాటే మనస్సుంటే వయస్సైపోయినా కొత్త కొత్తగా ఇంకేదైనా చేయొచ్చు.. ఇదిగో ఇలాంటి ఆలోచనల్లో కొందరు కనిపిస్తుంటారు. అలాంటి వ్యక్తే తమిళ్ సూపర్ స్టార్.. థాలా అజిత్ కుమార్. ఈ మాటంటోంది ఎవరో కాదు.. సఖి, చెలి అంటూ తమిళ, తెలుగు అమ్మాయిలెందరి హృదయాలలో కొల్లగొట్టిన హీరో మాధవన్. అందుకే తాను థాలాకు సెల్యూట్ చేస్తున్నానంటున్నాడు మాధవన్. ఎందుకంటే, మాధవన్ ఇప్పుడు మళ్లీ పతాక శీర్షికలకెక్కాడు. నటుడిగానో, తన కొత్త సినిమా ఎవరో సుప్రసిద్ధ దర్శకుడితో ప్రకటించో కాదు.. తనకిష్టమైన రేసింగ్ లోకి మరోసారి దూసుకొచ్చి. నటుడిగానే కొనసాగి ఉండి ఉంటే అజిత్ తమిళ్ ఇండస్ట్రీలో ప్రయోగాత్మకమైన సినిమాలు చేసే విక్రమ్, సూర్య తరహాలోనో.. మాస్ ఇమేజ్ తో తమిళ సూపర్ స్టార్ గా ఎదిగి, ఇప్పుడు రాజకీయాల్లోకి దూసుకొచ్చిన విజయ్ లాగానో.. ఇంక తనకెదురే లేకుండా ఉండేవాడేమోగానీ.. అజిత్ టేస్ట్ వేరు. తనో నటుడిగా, హీరోగా క్యారెక్టర్స్ చేస్తున్నా తన దృష్టి మాత్రం ఎప్పుడూ రేసింగ్ ట్రాకులపైనే!**



# ఇమేజ్ చట్రంలో ఇరుక్కోని రేసుగుర్రం అజిత్!

ఇప్పుడు మళ్లీ అజిత్ కుమార్ స్పెయిన్ లోని సర్క్యూట్ డి బార్సిలోనా-కాటల్యునాలో నెక్స్ట్ రైడింగ్ కోసం రెడీ అవుతున్నాడు. దీంతో మోటార్ స్పోర్ట్స్‌పై అజిత్ అభిమానం మరోసారి వార్తై కూర్చుంది. ఇప్పుడు తోటినటులు కూడా అభినందనలు కురిపిస్తున్నారు. మోటార్ రేసింగ్ అజిత్‌కు ఓ కల.. ఆ కలల వెంట తను పరుగెడుతూనే ఉంటాడు. దానికి తన సినిమా కెరీర్‌తో సంబంధం లేదు.. వయస్సుతో అంతకన్నా సంబంధం లేదు.. తనకు మోటార్‌స్పోర్ట్స్ పట్ల ఉన్న క్రేజ్.. తనకిష్టమైన క్రీడలో ఏదో సాధించాలన్న తపన, సంకల్పం ఆకట్టుకునేవంటాడు మాధవన్. ఎప్పుడెప్పుడు అజిత్ ట్రాక్ పైకెక్కుతాడా.. అతడి అభిమానిగా, సహనటుడిగా ఆ దృశ్యాన్నెప్పుడెప్పుడు చూస్తానా అన్న క్యూరియాసిటీ తనను వేధిస్తోందంటూ తన ఆసక్తిని కనబరుస్తున్నాడు మాధవన్.

త్వరలోనే ఫార్ములా వన్ రేసులో పాల్గొనబోతున్న అజిత్ 24హెచ్ రేస్ కోసం సంసిద్ధమవుతున్న తన ఫోటోస్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండింగ్‌గా మారాయి. మాధవన్‌తో పాటు, సహ నటులెందరి నుంచో అభినందనలు వెల్లువెతుతున్నాయి. మరోవైపు ఇక ఆయన అభిమానులైతే ఆకాశానికెత్తేస్తున్నారు. అయితే, ఈసారి పోటీల్లో అజిత్ వ్యక్తిగతంగా ఫార్ములా రేసింగ్ లో పాల్గొనడమే కాకుండా ఓ జట్టుకు నాయకుడిగా కూడా లీడ్ చేయడం విశేషం. ప్రపంచస్థాయి రేసింగ్ పోటీల్లోనూ తనను తాను నిరూపించుకోవాలన్న కసి, తపన మాత్రం ఎప్పటికప్పుడు అజిత్ లో కనిపిస్తూనే ఉంటాయి.

అజిత్ ఈ రేసింగ్ పోటీల్లో పాల్గొనడం ఇప్పుడ అజిత్ వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిందో, కేవలం తమిళ పరిశ్రమకో, సినీ పరిశ్రమకు సంబంధించిందో మాత్రమే కాదు. ఇది యావత్ దేశానికే ప్రతిష్ఠాత్మకమైన వేడుక. అజిత్ ఇటీవలే ఫెరారీ 488 ఈవీఓ ఛాలెంజ్‌ని దుబాయ్ ఆటోడ్రోమ్‌లో నడిపి పరీక్షలో పాసయ్యాడు. దీంతో రేసింగ్‌లో అజిత్ ఇప్పుడు కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు.



యూరోపియన్ 24హెచ్ సీరీస్‌లో తీవ్రమైన పోటీ నెలకొన్న పోర్షే 992 జీటీ3 కప్‌తో పాటు.. ఇతర అంతర్జాతీయ రేసింగ్ పోటీల్లో కూడా ఇప్పుడు అజిత్ బృందం పోటీ పడుతోంది. కేవలం రేసులను గెలవడమే కాకుండా ఈ రేసింగ్ పోటీల్లో భారత్ ప్రాతినిధ్యాన్ని చాటిచెప్పేలా జెండా పాతాలనీ చూస్తోంది. ఇందుకోసం యువ డ్రైవర్స్‌తో పాటు తమ బృందాన్ని లీడ్ చేసే రోల్‌లో ప్రముఖ రేసర్ ఫాబియన్ డఫీక్స్‌ను నియమించుకోగా.. డఫీక్స్ కూడా అజిత్‌తో కలిసి పనిచేయడాన్ని ఎంతో క్రేజ్‌గా ఫీల్ అవుతున్నట్టు ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. మొత్తంగా అఫీషియల్ డ్రైవర్‌గా ఫాబియన్ డఫీక్స్ ముందరి సీట్లో రేసింగ్‌లో ఉంటే లీడర్‌గా బ్యాక్ సీటులో ఇప్పుడు అజిత్ ఉండబోతున్నాడు.

అజిత్ రేసింగ్ కెరీర్‌లో ఇదే కొత్తేం కాదు. గతంలో 2004 ఫార్ములా ఆసియా బీఎండబ్ల్యూ ఎఫ్3 ఛాంపియన్‌షిప్‌తో పాటు 2010లో ఫార్ములా 2 రేసింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లోనూ అజిత్ పాల్గొన్నాడు. అయితే, అజిత్, అదే విధంగా తాను నియమించుకున్న ఫాబియన్ డఫీక్స్ ప్రధాన లక్ష్యాలు వారికున్న క్రేజ్, పోటీ పడాలనే తపన పక్కనబెడితే మరింత మంది యువతను ఇటువైపుగా తీసుకొచ్చే ఓ కొత్త ప్రయత్నం జరుగుతోందంటూ అజిత్, డఫీక్స్ ఇద్దరూ తమ సోషల్ మీడియా బ్లాగ్స్‌లో పోస్ట్ చేస్తుండటంతో వీరి రేసుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సో.. మరి మనమూ ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా..?

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## పాపం జాన్వి.. ఎంత కష్టం వచ్చిందో..?

బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు తన ఫోకస్‌ని సౌత్ ఇండస్ట్రీ మీద కూడా పెట్టింది జాన్వికపూర్. సినిమాలో జాన్వి ఉంది అంటే గ్లామర్ పరంగా అదరిపోతుంది అంతే అన్నట్టుగా ఉంది. జాన్వి కపూర్ గ్లామర్ సీక్రెట్ ఏంటన్నది తెలియదు కానీ అమ్మడు అలా కనిపించడానికి చాలా ఇష్టమైన వాటిని దూరం చేస్తుందని తెలుస్తుంది. ముఖ్యంగా లుక్ విషయంలో హీరోయిన్స్ చాలా జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. ఐతే జాన్వి లేటెస్ట్‌గా తన సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ ఆమె బాధ ఏంటన్నది అర్థమవుతుంది. జాన్వికపూర్ ఒక కప్‌లో ఐస్‌క్రీంతో కూడిన కుకీస్‌ను చూపిస్తూ ఎవరైనా నన్ను ఆపేయమని చెప్పండి అంటూ కామెంట్ పెట్టింది. అంటే మనసుకి తినాలని ఒకవైపు అనిపిస్తున్నా మళ్లీ దీని వల్ల ఏదైనా శరరీ మార్పులు వస్తే కష్టమని తనకు తానుగా వద్దని చెప్పుకోలేక ఎవరైనా సరే వద్దని చెప్పండి అంటూ రాసుకొచ్చింది. కోట్లు కొద్దీ సంపాదించే వారు ఎలా పడితే అలా తింటారు.. ఏది కావాలంటే అది చేస్తారని అనుకుంటారు. కానీ నిజానికి వాళ్లు ఎన్నో రకాల డైట్ ప్లాన్ ఫాలో అయితేనే తెరమీద అంత అందంగా కనిపిస్తారు. సరైన క్రమపద్ధతిలో డైట్ ఫాలో అవ్వడం వల్లే అలా కనిపిస్తారు. ఐతే కొందరు తమ కోరికలను నిగ్రహించుకోలేక ఏది పడితే అది తినేసి శరీరంలో మార్పులకు కారణమవుతారు. మరి జాన్వి ఐస్‌క్రీం ఎందుకు తినకూడదు అనుకుందో కానీ ఎవరైనా ఆపమంటే మాత్రం ఆపేస్తా అన్నట్టుగా చెప్పుకొచ్చింది.

-తుపాకి.కామ్ సౌజన్యంతో..






పెళ్లంటే.. పందిళ్లు
తప్పెట్లు తాళాలు, భాజా భజంత్రీలు
మూడే ముళ్ళు.. ఏడే అడుగులు
మొత్తం కలిపి నూరేళ్లు.
నూరేళ్ళే! ఒక్కళ్లతోనే!.. అంత టైం
లేదు విడాకులిచ్చేయండి. ఇప్పటికే
యాభై దాటిపోయాయి. 'అమ్మా!
నాన్నా! నేను విడాకులు
తీసుకుందామనుకుంటున్నా!'
'లాయర్ ఎవరో చెప్పమ్మా! మేము
కూడా తీసుకోవాలి'


# వివాహ వ్యవస్థకు దెబ్బ.. గ్రే డైవోర్స్!

**విడాకులంటే?**

ఆంక్షలు లేని జీవితం, ఎవరినీ భరించనక్కరలేదు, హాయిగా ఎగిరిపోతే ఎంత బాగుంటుందీ అనుకుంటూ సంతోషించడం.. ఇదీ విడాకులు తీసుకునే వారి అభిప్రాయం. కొన్నాళ్ల క్రితం దాకా పెళ్లయిన పిల్లలు విడాకులు తీసుకుంటారేమో అని తల్లిదండ్రులు భయపడేవారు. కాలం కాని కాలం ఒకటి వచ్చిపడింది. తల్లిదండ్రులు విడాకులు తీసుకుంటున్నారని పిల్లలు బాధపడుతున్నారు. ఇకపై పెళ్లి, పిల్లలు మాత్రమే వేడుక కాదు. విడాకులు కూడా వేడుకే అన్నట్టు గ్రే డైవోర్స్, సిల్వర్ స్ప్లిటర్స్ , లేట్ లైఫ్ డైవోర్స్ అని 50 దాటినవాళ్లు విడాకులకు తొందర పడుతున్నారు. గతంలో కన్నా దాదాపు 45 శాతం పెద్దవాళ్ళు విడాకుల తీసుకోవడం పెరిగిందట. ఈ మధ్య సెలెబ్రిటీల విడాకులతో ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది.

సైఫ్- అమృత, కమలహాసన్- సారిక, హ్రితిక్ -సుసానే, తాజాగా ఏ ఆర్ రెహమాన్- సైరాబాను విడాకులు వివాహ వ్యవస్థ మనుగడపై అనుమానాలు కలిగిస్తోంది. ఇన్నాళ్లూ విదేశాల్లో, ప్రముఖులకు మాత్రమే ఇది సాధారణం అనుకునేవారు. మిగతావాటి





మాదిరి విడాకుల సంస్కృతి కూడా దిగుమతి అయినట్టుందని సనాతనవాదులు గొణుక్కుంటున్నారు. ఇంతకీ మధ్యవయసులో విడాకులకు కారణాలేంటి?

మనకు తెలిసినంతవరకు మన సంస్కృతిలో మహిళలు ఎప్పుడూ త్యాగాలకు సిద్ధంగా ఉండాలి. తనకంటూ కోరికలేవీ లేకుండా కుటుంబానికి అంకితం కావాలి. ఆమె పేరున ఎటువంటి ఆస్తులూ ఉండవు. పిల్లల్ని పెంచడం బాధ్యత. హక్కులు ఉండవు. మానసికంగా శారీరకంగా అలసిపోయి అలాగే జీవచ్ఛవాల్లా ఉండేవారు. మెల్లిగానైనా ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. చదువుకుని ఉద్యోగం చేస్తూ తమకు నచ్చినట్టు ఉండటం ప్రారంభించారు. ఆస్తి హక్కు చట్టం వల్ల వారికి మేలు జరిగింది. ఆ తర్వాత కుటుంబం కోసం ఎప్పుడూ మహిళలే ఎందుకు కష్టపడాలనే ప్రశ్న ఉదయించింది. అక్కడినుంచి కుటుంబాల్లో గొడవలు మొదలయ్యాయి. పురుషాధిక్య భావజాలం ఉన్న మగవారు అణచివేత ప్రారంభించారు. దాంతో మహిళలు విడాకులకు సిద్ధపడుతున్నారు. అలాగే మహిళల హింస భరించలేని మగవారూ విడాకులు కోరుకుంటున్నారు. అయితే మగవారి విడాకులకు ప్రధాన కారణం వారి అక్రమ సంబంధాలు కాగా, మహిళలు ప్రశాంతమైన జీవితం కోసం విడాకులు తీసుకుంటున్నారు. వీరికి కొన్నిసార్లు పిల్లలు సాయపడుతున్నారు.

సాధారణ జంటల విడాకుల కారణాలకు, సెలబ్రిటీ జంటల విడాకులకు చాలా తేడా ఉందంటున్నారు ప్రముఖ న్యాయవాది వందన. ఈవిడే ఏ ఆర్ రెహ్మాన్ భార్య సైరాబాను తరఫు లాయరు కూడా. సమాజంలో ప్రముఖులుగా ఉన్నవారి విడాకులకు అక్రమ సంబంధాలు కారణం కాదంటారీమె. అసలది పెద్ద విషయమే కాదట వారికి. రాజకీయంగా, సాంస్కృతికంగా ఎదురయ్యే అభిప్రాయ భేదాలు, పిల్లల పెంపకం ఇవి వారు విడిపోవడానికి కారణాలంటారు వందన. అదీ కాక జీవితంలో అన్నీ అడగకుండానే వచ్చేస్తే ఒకరకమైన స్తబ్దత ఏర్పడుతుందని అటువంటి బోర్ డమ్ కూడా సెలబ్రిటీ విడాకులకు కారణం అంటారీమె. అదే సాధారణ జంటలైతే అవే కారణాలపై రాజీ పడతారని, సెలబ్రిటీ లకు అలా రాజీ పడే అవసరం ఉండదని కూడా అంటారీమె.

సమాజం వేగంగా మారుతోంది. పిల్లలు, పెద్దవాళ్ళు ఎవరిపైనా ఆధారపడటానికి సిద్ధంగా లేరు. పిల్లలు పెద్దవాళ్ళయ్యాకైనా సరే, తమకీ జీవితం కావాలని తల్లిదండ్రులు విడిపోతున్నారు. ఇండియన్ నేషనల్ బార్ అసోసియేషన్ సర్వేలో విడాకులు కోరుతున్నవారిలో 45 శాతం 50 ఏళ్ళు పైబడిన వారే అని వెల్లడైంది. ఇలాంటివేమీ భారతీయ కుటుంబ వ్యవస్థని దెబ్బ తీయలేవు, ఈ విడాకులన్నీ చదువుకున్న, పట్టణ ప్రాంత ధనిక వర్గాలకే పరిమితం అనేవారు ఉన్నారు గానీ ప్రస్తుతానికైతే పరిస్థితి గంభీరంగానే ఉందని చెప్పచ్చు.

**-కె. శోభ**



## నెమలి పింఛంపై గురజాడ చిత్రం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



నవయుగ వైతాళికుడు, దార్శనికుడు, మహాకవి గురజాడ అప్పారావు 109 వ వర్ధంతి శనివారం జరగనున్న నేపథ్యంలో నెమలి పింఛంపై గురజాడ చిత్రాన్ని వాడాడ రాహుల్ పట్నాయక్ అపూర్వంగా వేసారు.ఆధునిక తెలుగు సాహిత్యానికి యుగకర్త అయిన గురజాడ రచనలంటే తనకు ఎంతో ఇష్టమని అన్నారు.ఆ దార్శనికునిపై ఉన్న మమకారంతోనే ఈ చిత్రాన్ని అత్యంత శ్రద్ధాసక్తులతో రూపకల్పన చేశారు. శ్రీకాకుళం నగరానికి చెందిన రాహుల్ జాతీయ, అంతరాజతీయ స్థాయిల్లో ఎన్నో పురస్కారాలు పొందారు.పక్షుల వెంట్రుకలపై శ్రీనివాస కల్యాణం,శ్రీరామ పట్టాభిషేకం, శ్రీకృష్ణ రాసలీల ఘట్టాలతో పాటు సింహాద్రి అప్పన్న, ఈశ్వరుడు, వినాయకుడు తదితర చిత్రాలు వేశారు.అలాగే స్వామి వివేకానంద, భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా చిత్రాలను పక్షివెంట్రుకలపై అపురూపంగా వేశారు. పాఠశాలల గోడలపై ఎన్నో విద్యా సంబంధిత చిత్రాలను వేసి ప్రశంసలు పొందారు.గత రెండు దశాబ్దాలుగా లలితకళలల్లో ఒకటైన చిత్రలేఖనానికి విశిష్ట సేవలందిస్తున్నారు.ఆయా రచయితల పుస్తకాలకు ముఖచిత్రాలు వేసి కళా ప్రియుల హృదయాలను దోచుకుంటున్నారు.బియ్యపు గింజలపై సయితం చిత్రాలను వేసి తన సత్తా చాటుకుంటున్నాడు.అమెరికా బుక్ ఆఫ్ వరల్డ్,రావా బుక్ ఆఫ్ వాల్ రికార్డ్స్, ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్,హై రేంజ్ వరల్డ్ రికార్డ్స్, గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, గిన్నీస్ బుక్ లో స్వర్ణ పతకం సాధించాడు.ఈ రికార్డులలో సముచిత స్థానం పొందాడు.పక్షుల వెంట్రుకలపైన, బియ్యపు గింజలపై వేసిన చిత్రాలకు గాను ఈ అవార్డులను సొంతం చేసుకున్నాడు.మరో విశేషమేమంటే రాహుల్ పక్షుల ప్రేమికుడు. వివిధ జాతులకు చెందిన 35 పక్షులను పెంచుతున్నాడు.వాటిని పోషిస్తూ సంరక్షణ బాధ్యతలను చేపట్టిన రాహుల్ అభినందనీయుడు.

## 108 సిబ్బంది కంట పడిన పెద్దపులి

(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

మండలం పొడుగుపాడు గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి పెద్దపులి జాతీయ రహదారి దాటుతుండగా సంతబొమ్మాళి మండల 108 సిబ్బంది కంటపడింది. జిల్లా కేంద్రంలో పేషెంట్‌ను జాయిన్ చేసి తిరిగి వస్తుండగా రహదారి దాటుతున్న పెద్దపులి కనిపించిందని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది పెద్దపులి పాద ముద్రలు గుర్తించి నిర్ధారించారు.





జిల్లా తెలగ సంక్షేమ సంఘం భవనానికి అవసరమైన నాలుగు ఏసీలను రిటైర్డ్ మెజిస్ట్రేట్ ఊడి శ్యామ్ సోదరి ఊడి కనకమహాలక్ష్మి శుక్రవారం అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి భవన నిర్మాణ పూర్తి చేయుటకు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయుడు. పిల్లలు నీలాద్రి, ఊడే శ్యామ్, పూడి సునీత, గైనేటి సుధారాణి, పత్తి జయలక్ష్మి, కొండ రాంబాబు, వైవీ రమణారావు వై.చిట్టిబాబు, ఎం.నాగేశ్వరరావు పి.దయానంద్, ఎం.మాధవరావు, కేశిరెడ్డి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు. **– సత్యంన్యూస్, శ్రీకాకుళం.**

## కూటమి ప్రభుత్వం ప్రజల పక్షం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా పాలన అందించే ప్రజాప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని ఒకరోజు ముందే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతోందని శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారం వెంకటేష్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అండగా నిలుస్తూ శ్రమిస్తూ పని చేస్తుందని గత వైకాపా పాలనలో పెన్షన్స్ ఒక నెల తీసుకోకపోతే వెంటనే రద్దు చేసే వారిని కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అన్ని వర్గాలవారు ఆనందంగా ఉండాలన్న తలంపుతో ముఖ్యంగా పెద్దవారు, పేదలు సంతోషంగా వుండాలన్న గొప్ప సంకల్పంతో రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా ఆ రెండు నెలలు కలిపి 3వ నెలల్లో ఫెన్షన్స్ అందుకునే అద్భుతమైన అవకాశం పెన్షన్లు లబ్ధిదారులకు కల్పిం చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతీ నెల 1న ఉదయం 5 గంటలనుండే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులతో అందించే ఏర్పాట్లు చేశామన్నారు. 1 తారీకు ఆదివారం అయితే ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పెన్షన్ అందించేది కూటమి ప్రభుత్వమేనన్నారు. అన్ని సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వ పథకాలకు ముఖ్యమైనది తెలుపు రేషన్ కార్డుఅని, అవి లేని వారి కోసం ప్రభుత్వం డిసెంబర్ 2నుంచి 28వరకు కొత్త రేషన్ కార్డులు కోసం దరఖాస్తులు స్వీకరిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వెంకటేష్ తెలిపారు.



## ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజలస భారాలు మోపే విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగింపు ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, సీపీఐ (యం.ఎల్) జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు చిక్కాల గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "ప్రజలపై విద్యుత్ భారాలు ప్రజలపై వేయొద్దనే" అంశంపై శ్రీకాకుళం ఎన్.జి.వో హోంలో రౌండ్ టేబుల్ సమావేశం వామపక్షాలు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ రైతులు, కార్మికులు, ప్రజల పాలిట ఉరితాళ్ళుగా మారనున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్స్‌కు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం కొనసాగిస్తున్నారని, వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అదానీ, షిర్డీసాయి సంస్థలతో కుమ్మక్కయ్యి, వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని నాడు ఆరోపించారు. నేడు టీడీపీ కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్‌మీటర్ పెట్టడం నమ్మకద్రోహమేనని విమర్శించారు. ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్ పెట్టి ముందుగానే ప్రజలు డబ్బులు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలని, బ్యాలెన్స్ పూర్తి కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, పేదలకు అంధకారమే మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయం 96నెలల



పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుండే వసూలు చేస్తారని, మరోవైపు విద్యుత్ అధికంగా వినియోగించే రాత్రి వేళల్లో అధికరేట్లు వసూలు చేయటం నడ్డి విరిచే భారం కాదా అని ప్రశ్నించారు. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఎసరపెట్టేందుకే పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని ఏ భారం ఉండదని పైకి చెప్తున్నా ప్రయివేటు విద్యుత్ ఉత్పత్తిదారులకు దోచిపెడుతూ, ప్రజలపై భారాలు వేసేందుకు, ఉచిత విద్యుత్‌ను దశలవారీగా తొలగించడానికి ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాడు వైకాపా, నేడు తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ మీటర్లను కొనసాగించడం గర్హనీయమన్నారు. ఇప్పటికే 17 వేల కోట్ల రూపాయలు ట్రూఅప్ చార్జీల భారం వేస్తున్నారని మరోవైపు స్మార్ట్‌మీటర్లు బిగిస్తూ ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించటం తగదన్నారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ చార్జీల అంశంపై వైకాపా దారిలోనే తెలుగుదేశం ప్రభుత్వం ప్రయాణిస్తున్నదని ఈ అంశాలపై ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి స్మార్ట్ మీటర్లు ఆపాలని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, కె.సూరయ్య, యం.గోపి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
















## అధికారంలోనూ, ప్రతిపక్షంలోనూ వైకాపా ఫెయిల్

(మొదటిపేజీ తరువాయి)

వచ్చి బయటకు మోసుకుపోవడాలు.. ఇవన్నీ జరిగాక బయటి మీడియా పాయింటు దగ్గర ప్రకటనలు, గాంధీ విగ్రహం వద్ద నిరసనలు, మూతికి గుడ్డ కట్టుకుని మౌనప్రదర్శనలు.. ఈ తతంగం అంతా జరగాలి కదా. అదేమీ లేకుండా మీడియాని పిలిచి నేను చెప్దామనుకున్నది చెప్పేస్తా అంటే మజా ఏముంటుంది? అసలు ప్రెస్ ఇతన్ని పట్టించుకోవాలని ఏముంది? 'అధికారంలో ఉన్న ఐదేళ్లూ నీ కంటికి మేం ఆనలేదు. ఒక్కసారి పిలవలేదు. ఇప్పుడు పిలవగానే పరిగెట్టుకుని వచ్చి కవర్ చేయాలా? ఎల్లెల్లవోయ్' అంటే? ప్రతిపక్ష నాయకుడి హోదా లేకపోతే అసెంబ్లీకి వెళ్లనక్కర లేదని జగన్ లాగే జాతీయ స్థాయి పార్టీలు అనుకుని ఉంటే అవి గత పదేళ్లగా పార్ల మెంటుకే వెళ్లేవి కావు. పార్టీ తరఫున ఒక్క సభ్యుడే ఉన్నా అసెంబ్లీని, పార్లమెంటుని గడగడలాడించిన మహానుభావులెందరో ఉన్నారు. 1985 పార్లమెంటులో బీజేపీకి రెండే సీట్లు. అయినా వెళ్లారు, తమ తడాఖా చూపించారు. ఐదేళ్లు పోయేసరికి 85 సీట్లు తెచ్చుకున్నారు. ఇప్పుడు జగన్ ఓటర్లతో చెప్పేది ఎలా ఉందంటే – 'నన్ను ముఖ్య మంత్రిని చేస్తేనే ఐదేళ్లూ అసెంబ్లీకి వెళతాను, ప్రతిపక్ష నాయకుణ్ని చేస్తే నాలుగేళ్లు వెళతాను. అదీ చేయకపోతే అస్సలు వెళ్లనంతే. ఎన్నికల తర్వాత నా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుని తదను గుణంగా ఓటు వేయండి. తర్వాత నన్ను తప్పు పట్టి ప్రయోజనం లేదు.' అని. 'ఇంతకంటె అసెంబ్లీకి వెళ్లి మన గోడు వినిపించే మరో ప్రతిపక్షానికి ఓటేసుకుంటే బెటరు కాదూ' అని ఆంధ్ర ఓటరు అనుకున్నాడంటే ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు.

## పంచాయతన యాగ మహోత్సవ కరపత్రం ఆవిష్కరణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పాతశ్రీకాకుళం శ్రీ సంతోషిమాత అమ్మవారి దేవస్థానంలో ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు జరప బోయే శ్రీ సంతోషి మాత అమ్మవారి సహిత పంచాయతన యాగం మహోత్సవాల కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. లోక కళ్యాణం, భక్తజన శ్రేయస్సు కోసం ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కర పత్రాలు ఆవిష్కరణ కిరణ్‌శర్మతోపాటు దేవదాయ శాఖ కార్యనిర్వ హణ అధికారి కె.సర్వేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండవలస శతజయంతి వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శిష్టకరణాల అభ్యున్నతికి అహర్నిశలూ కృషిచేసిన కొండవలస చలపతిరావు శతజయంతి వేడుకలు శ్రీకాకుళం జిల్లా శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని శిష్టకరణాల సామాజిక భవ నంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రేమసమాజం, రిక్షాకార్మికుల గౌరవ అధ్యక్షులుగా చలపతిరావు విశేష సేవలందించారని, అతని స్ఫూర్తితోనే కేంద్ర స్థాయిలో బీసీ సాధించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తట్టికోట జోగారావుతో కలిసి సంఘ పటిష్ఠతకు విశేష కృషి చేశారని, శిష్ట కరణాల సంపూర్ణ చరిత్రను 1984లో రచించి బంధుజనులకు జాతి చరిత్రను సమూలంగా అందించిన శిష్టకరణ బంధువు కొండవలస చలపతిరావు, శిష్టకరణ బీసీ సాధనకు నౌపడ గోపాలకృష్ణతో కలిసి కృషి చేశారని గుర్తుచేశారు. శ్రీకాకుళం జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షులు డబ్బీరు శ్రీనివాసరావు, చలపతిరావు కుటుంబ సభ్యులను దుశ్శాలువతో సత్కరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్య లో శిష్టకరణాలు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిష్టకరణం కార్యదర్శి సదాశివుని కృష్ణ, ఆర్‌వీఎన్ శర్మ, జగ న్నాధరావు, బెహరా రామచంద్రరావు, సతీష్, సుధాకర్, కొండవలస రవి, కొండవలస వైకుంఠరావు, శివప్రసాద్, అఖిలభారత సంఘం కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, పెదపెంకి శ్రీరామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు చక్రాల కుర్చీ బహూకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విశాఖపట్టణానికి చెందిన రాబిన్‌హుడ్ ఆర్మీ సంస్థ అధ్యక్షురాలు మాడుగుల రేణుక, హరికృష్ణలు అందించిన సహకారంతో శుక్ర వారం ఆర్ అండ్ బి భవనం ఎదురుగా ఉన్న శాంతాకళ్యాణ్ అను రాగ నిలయంలోని వయోవృద్ధులు, చిన్నారుల కోసం మూడు చక్రాల కుర్చీని నిలయం ప్రతినిధి పక్కి లలిత, జగ్గుమహంతి ఆశలకు శ్రీకాకుళం రాబిన్‌హుడ్ ఆర్మీ సభ్యులు నంది ఉమాశంకర్ అందిం చారు. అనంతరం అనురాగ నిలయం ప్రతినిధులు మాట్లాడుతూ ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నప్పుడు వైద్యశాలకు తరలించటంలో ఇబ్బందులు ఎదురౌతున్నాయని, ఇప్పుడు అందించిన చక్రాల కుర్చీ వీరికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాబిన్ హుడ్ ఆర్మీ సంస్థ అధ్యక్షురాలు మాడుగుల రేణుక మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన ఐబీఎం అండ్ గూడెర సంస్థలు ఈ చక్రాల కుర్చీలను అందించి సహకరిం చారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనురాగ నిలయం వార్డెన్ పక్కి లలిత, జగ్గు మహంతి ఆశ, వృద్ధులు, చిన్నా రులు, రాబిన్‌హుడ్ ఆర్మీ శ్రీకాకుళం సభ్యులు నంది ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మౌనమే ఆయన భాష.. ఇన్‌ఛార్జి కోసం పార్టీ ఘోష

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. ఇప్పుడు ఆమెను పార్టీ ఇన్‌ఛార్జిగా నియమిస్తే నిర్దేశించిన కార్యక్రమాలను తీసుకువెళ్లడానికి అనువుగా ఉంటారన్న వాదన కూడా వినిపిస్తుంది. వీరు మాత్రమే కాకుండా ఇటీవల జిల్లా పార్టీ కార్యదర్శిగా నియమితుడైన రాగోలుకు చెందిన గేదెల పురుషోత్తం పేరు కూడా బయట వినిపిస్తుంది. ఇందుకు కారణం ఆయన కూడా ధర్మానకు భక్తుడిగా ఉండటమే. ధర్మాన ఎప్పుడు ఖాళీ చేయమంటే అప్పుడు బేషరతుగా తప్పుకునే నాయకుడు ఇక్కడ అవసరం. అటువంటి వ్యక్తి అయితే పార్టీ కార్యక్రమాలను బలంగా జనంలోకి తీసుకువెళ్లలేరనే భావన వైకాపాది. మొత్తమ్మీద ఇక్కడ ఇన్‌ఛార్జి ఎవరనే దానిపైనే పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతోంది.

## రాత్రి గస్తీని పరిశీలించిన ఎస్పీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాత్రి గస్తీ విధులు పకడ్బందీగా నిర్వర్తించి అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని, వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని బీట్ సిబ్బందిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. గురువారం అర్ధరాత్రి శ్రీకాకుళం టూ టౌన్ పరిధిలో రిమ్స్ హాస్పి టల్ పోలీసు ఔట్‌పోస్ట్, పాలకొండ రోడ్డు కృష్ణాపార్క్ వద్ద రాత్రి గస్తీ నిర్వహణను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి నైట్ బీట్ నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ రాత్రి గస్తీ విధుల్లో భాగంగా పోలీసు సిబ్బంది నేర నియంత్రణకు నిరంతరం వాహన తనిఖీలు చేస్తూ, అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తూ ఉండాలన్నారు. ఏటీఎంలు, బ్యాంక్ లను తరచూ తనిఖీ చేస్తూ సెక్యూరిటీ గార్డుని అప్రమత్తం చేస్తూ ఉండాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేసేవారు ఎక్కువగా లాడ్జిలో ఉండే అవకాశం ఉన్నందున తనిఖీ చేయాలని, బస్టాండ్‌ల వద్ద అప రిచిత వ్యక్తుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాత నేరస్తులు కదలికలపై నిఘా వుంచి, పాయింట్ బుక్కులను క్షుణ్ణంగా తనిఖీ చెయ్యాలని, నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఎస్పీ సూచనలు చేశారు. రిమ్స్ హాస్పి టల్‌లో ఉన్న పోలీసు ఔట్‌పోస్ట్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులు, సిబ్బంది వివరాలు ఆరా తీశారు.

## కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- ఆర్టీసీ కాలనీలో రోడ్డు పనులకు శంకుస్థాపన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ–ఏ కాలనీ ఏడవ లైను ఆర్టీసీ కాలనీలో రోడ్డు పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం కార్పొరేషన్‌ను అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో అన్ని డివిజన్లోనూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వివరించారు. ఆయా డివిజన్లో సమస్యలు తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి, అనంతరం ఆయా డివిజన్లలో పర్యటించి క్షేత్రస్థాయి లోకి వెళ్లి సమస్యలను తెలుసుకుంటామని వివరించారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులు జరగక ప్రజల నుంచి వినతులు ఎక్కువగా అందుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, అభివృద్ధికి కూడా అంతే ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# టీఆర్ఎం రాజును బర్తరఫ్ చేయండి

**చర్యలు తీసుకోపోతే ఆమరణదీక్ష చేస్తా । ఎస్‌బీఐ ఆర్ఎంకు వినతిపత్రం ఇచ్చిన స్వప్నప్రియ తల్లి**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం రీజియన్‌కు ఇంతకు క్రితం ఆర్ఎంగా పని చేసిన టీఆర్ఎం రాజును విధుల నుంచి తొలగించాలని, లేదంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని గార ఎస్‌బీఐలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేసి ఆత్మహత్య చేసుకున్న ఉరిటి స్వప్నప్రియ తల్లి ఉరిటి సరళ పేర్కొ న్నారు. ఈమేరకు శుక్రవారం ఎస్‌బీఐ రీజ నల్ కార్యాలయానికి వెళ్లి ఆర్ఎంకు వినతి పత్రం సమర్పించారు. గార బ్రాంచిలో బంగారు నగలు మాయమైన కేసులో ఎటు వంటి ప్రాథమిక దర్యాప్తు శాఖాపరంగా చేపట్టకుండా తన కుమార్తె ఆ బంగారాన్ని అపహరించిందని పోలీసులకు ఫిర్యాదు చేయడం, అంతకు ముందే ఆమె చోరీకి పాల్పడిందని పత్రికల్లో రాయించిన టీఆర్ఎం రాజుపై శాఖాపరంగా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆమె వినతి పత్రంలో పేర్కొన్నారు. బ్యాంకు నుంచి మాయమైన బంగారంతో తాము ఆస్తులు కొనుక్కున్నామని, షేర్‌మార్కెట్లలో పెట్టుబడు లు పెట్టామని పోలీసులకు చెప్పిన టీఆర్ఎం రాజు ఈ కుంభకోణానికి అసలు సూత్రధారి అని, బ్యాంకు యాజమాన్యం మాత్రం ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోపో వడం సరికాదని ఆమె పేర్కొన్నారు. అనం తరం మీడియాతో మాట్లాడుతూ గార ఎస్‌బీఐ అంశంలో కేవలం టీఆర్ఎం రాజు సూచనలు, సలహా మేరకే అప్పటి పోలీసు యంత్రాంగం కేసు నమోదు చేసిందని, పత్రికల్లో వచ్చిన కథనాల వల్లే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని, దీని వెనుక టీఆర్ఎం రాజు పథకం ఉందని చెప్పారు. తమ పాన్‌కార్డులు, ఆధార్ కార్డులను ఎప్పుడు అడిగినా సమర్పిస్తామని ఏమేరకు ఆస్తులు కొనుగోలు చేశామో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. తన కుమార్తె చనిపోయి శుక్రవారానికి సరిగ్గా ఏడాది అయిందని, ఇప్పటికీ ఇందుకు సూత్రధారి టీఆర్ఎం రాజు మాత్రం విధుల్లో కొనసాగుతున్నారని, ఆయన్ను బర్తరఫ్ చేయకపోతే తామూ ప్రాణ త్యాగాలకు సిద్ధపడతామని ఆమె హెచ్చరిం చారు. ఆర్ఎంను కలిసినవారిలో శిష్టకరణ సంఘ నాయకులు పట్నాయకుని మధు సూదనరావు, సదాశివుని కృష్ణతో పాటు మరికొందరు ఉన్నారు.

# ఉత్తరాంధ్ర రహదారులకు మహర్దశ కల్పించాలి

**– కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి గడ్కరీని కోరిన రాము –**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్ర జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే రహదారులకు మహర్దశ కల్పించా లని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో కలుసుకొని, వినతిపత్రం అందజేసి, వాటి ప్రాధాన్యతపై చర్చించారు. జిల్లా మీదుగా విస్తరించి ఉన్న జాతీయ రహదారి –16ను నరసన్నపేట – ఇచ్ఛాపురం మధ్య 6 లైన్లకు విస్తరించాల్సిన ప్రాధాన్యతను వివరించారు. భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి విశాఖపట్నం మధ్య రహదారికి అనుబంధంగా అప్రోచ్ రోడ్డు నిర్మించాలన్నారు. దీని కారణంగా విశాఖ ఎయిర్ పోర్టుకు సైతం సులభంగా చేరుకో వచ్చని తెలిపారు. తద్వారా రాష్ట్ర పురోగతిలో భాగమయ్యే అవకాశం కల్పించాలన్నారు.



**మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం..**

కళింగపట్నం – శ్రీకాకుళం – పార్వతీ పురం మధ్య ఉన్న సీఎస్పీ రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు విన్నవించారు. దీని ద్వారా ఒడిశాలోని రాయగఢ, ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌తో అనుసంధానం పెరుగుతుందని పేర్కొన్నారు. అలికాం–బత్తిలి రోడ్డు విస్తరణతో ఒడిశాలోని పర్లా కిమిడిని కలపవచ్చని గుర్తు చేశారు. అలాగే డీపీఎన్ రోడ్డు (డోల – పోలాకి – నౌపడ)ను విస్తరించడం ద్వారా నరసన్నపేట – నౌపడ – మూలపేట పోర్టు – మెళియా పుట్టి) మార్గంలో కీలక పురోగతి సాధించ వచ్చని వివరించారు. దీని ద్వారా దాదాపు లక్ష మందికి పైగా ప్రజలు, రైతులకు మేలు చేకూర్చవచ్చని తెలియజేశారు. జిల్లా ప్రజ లకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రాధాన్యతగా భావిస్తానని, రోడ్ల విస్తరణతో ఉత్తరాంధ్ర జిల్లాల సమగ్ర అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. దీనిపై నితిన్ గడ్కరీ సానుకూలం గా స్పందించినట్లు రామ్మోహన్ నాయుడు కార్యాలయం వెల్లడించింది.

## గల్ఫ్‌లో ఆంధ్రా కార్మికులు, వీసా అప్లికేషన్ సెంటర్లపై విదేశాంగమంత్రికి కలిశెట్టి వినతి



**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో కేంద్రమంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ ఆయన కార్యాలయం లో మర్యాదపూర్వకంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కలిశారు. ఈ సందర్భంగా గల్ఫ్ దేశాల్లో ఆంధ్రప్రదేశ్ కార్మికుల సమస్యలు, వీసా అప్లికేషన్ సెంటర్ల అవసరంపై తదితర అంశాలపై వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని కోస్తా ఆంధ్ర, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి ప్రాంతాల నుంచి వేలాది మంది తెలుగు వారు జీవనోపాధికి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారని, ఈ కార్మికులు తమ కుటుంబాలను పోషించడానికి, వారి జీవితాలను మెరుగు పరచడానికి విదేశాల్లో అహర్నిశలు శ్రమిస్తు న్నారని, కానీ, వారి జీవన పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉన్నాయన్నారు. తగిన వసతులు లేకపోవడం, మౌలిక అవసరాలకు అందు బాటు లేకపోవడం, భాషాపరమైన ఆటంకాలు వారి జీవితాలను మరింత కష్టతరం చేస్తున్నా యని వివరించారు. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రిగా గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న తెలుగువారికి భరోసా కల్పించే చర్య లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అమరావతి, విశాఖపట్నంలో వీసా అప్లికేషన్ సెంటర్లను స్థాపించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విద్యార్థుల, వృత్తి నిపుణుల, కుటుం బాల విదేశీ కలలను నెరవేర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తోందని, అగ్రరాజ్యాలైన అమె రికా, కెనడా వంటి దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లే భారతీయ విద్యార్థు లకు రాష్ట్రంలో వీసా అప్లికేషన్ సెంటర్లు లేకపోవడం వల్ల, ప్రజలు హైదరాబాద్, చెన్నై, లేదా ఢిల్లీకి ప్రయాణించి వీసా పను లను పూర్తి చేయవలసి వస్తోందన్నారు. ఇది వారికి ఆర్థికంగా, సమయపరంగా భారంగా మారిందని, ఈ పరిస్థితి దృష్ట్యా అమరావతి, విశాఖపట్నంలో వీసా అప్లికేషన్ సెంటర్లను నెలకొల్పే అవసరాన్ని కేంద్రమంత్రికి కలిశెట్టి అప్పలనాయుడు వివరించారు.

## లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సంప్రోక్షణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తుమ్మావీధిలోని లక్ష్మీనృసింహస్వామి ఆల యంలో ఇటీవల మరమ్మతులు జరిపిన నేప థ్యంలో గర్భగుడి, పరిసరాలను శాస్త్రోక్తంగా శుక్రవారం సంప్రోక్షణ జరిపారు. ఆలయ అర్చకులు తిరుమల చంద్రశేఖర్ ఆధ్వర్యం లో వేదపండితులు పూజలు నిర్వహించారు. ఇటీవల ఈ ఆలయ మరమ్మతు పనులు, రంగులు వేయించిన నేపథ్యంలో ఆలయ సంప్రోక్షణ జరుపుతున్నట్టు చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.